# పుట్టుమచ్చ



ఖాదర్ మొహియుద్దీన్

# పుట్టుమచ్చ

ఖాదర్ మొహియుద్దీన్

కవిత్వం ప్రచురణలు

పుట్టుమచ్చ
ఖాదర్ మొహియుద్దీన్
59 A -15-32
భద్రయ్య నగర్
పటమట
విజయవాడ-520 006

కవిత్వం ప్రచురణలు-11
ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 1991
వెల : పది రూపాయలు

ముఖచిత్రం : జనవాది లేఖక్ సంఘ్
(రాజస్థాన్) ప్రచురించిన కేలండర్‌లోని బొమ్మ
టైటిల్ అక్షరాలు : పి.సత్యనారాయణ (వాని)
లే అవుట్ : బాబూరావు, విజయవాడ
లేజర్ టైప్ సెట్టింగ్: ప్రింటిక, విజయవాడ

ప్రతులకు : త్రిపురనేని శ్రీనివాస్
40-5/6-10
ఇస్రేల్ పేట
బందరు రోడ్డు
విజయవాడ-10.

మా రామప్రసాదు నాన్నగారు
రావి శేషయ్యగారి
స్మృతికి

# సంధ్య

ఊరు --
పక్కనే యేరు

వేళ్ళుకాళ్ళవి నగ్నంగా బారజాపి
ఏటిపీటిలో పీడల్ని శీర్షాసనం వేయించి
తపస్సు చేస్తున్న చెట్లు --

పసిపిల్లాడిలా చేతులాడిస్తున్న
బెల్‌బాటం తాటిచెట్టు --

ఎవరో చచ్చిన ఆవును
మోసుకుపోతున్నారు

దావితోక
వేలమీద ఎలిజీ రాస్తోంది.

మతిభ్రమించిన శిల్పిలా
మేఘాల్ని చెక్కుతూన్న గాలి --

ఏటిపిట్టపై నీలం రంగు
పెయింటు వేస్తున్న ఆకాశం --

స్మశానంలో దీర్ఘంగా
ధ్యానిస్తూన్న సమాధులు --

వెలుగు చీకట్ల
పట్టీలు వేస్తూ
ఎర్రలంగోటా చుట్టుకుని
కాలం వేసిన
శీర్షాసనం
ఈ సంధ్యాసమయం

# అంతే!

పోస్ట్‌మార్టంలో
అసళ్ళను మాయించేసి
నకళ్ళను నిజాలుగా నమ్మించే
చరిత్రకారుల కౌగిళ్ళో
నిన్నటి అనుభవాల శిలాన్ని పారేసుకుని
ఒళ్ళు విరుచుకుంటూన్న
సూర్యుని కళ్ళలో అలసట-
వంటినిండా చెమట-
రాత్రి రాసుకున్న చీకటి గోరింటాకు
ఎర్రందనపు ఆనందం!

ఉదయించడంలో ఉద్వేగం చచ్చిపోతే

సూర్యుడు కేవలం ఒక రంగు డబ్బా!

చిగర్చే ఆనందాన్ని మర్చిపోతే
చివరికి చెట్టైనా అంతే!

—ఏప్రిల్, 1975

# తట్టినట్లు

విరామంలో
నిర్విరామంగా
డాబామీంచి చాపిన చూపూ, నింగి
ఊదిన పూదారంగు రబ్బరు బూరలా కదుల్తున్నపుడు
చెల్లాచెదరైన గులకరాళ్ళలా కదలాడే కొండచరియల్లో
మనస్తాదాత్మ్యం పక్షుల్తో కలుస్తుంది.

నరాలు టపటపా రెక్కలు జాడిస్తాయి

ఏ మత్త చైతన్యం నించో
ఇసకేస్తే రాలనన్ని ఆలోచన్లు

మెదడు హైరానంలో కుస్తీపోటీ

ఎప్పుడో పాడుకున్న ఒక స్వేచ్ఛాగీతం
కాళ్ళను బంధించిన ఒక సంకెళ్ళ మోతా
ఆహ్లాదకరమైన వెన్నెట్లో ఒక చీకటిరాత్రీ
ఒక బాధాపాదరసానుభూతీ
గుర్తొచ్చి, కల్లోలిత సముద్రం
శిరస్సులో సుళ్ళు తిరుగుతుంది.

చూపుల తెరచాపల్ని దించి
పడవల్లా పైకి లేస్తాయి కళ్ళు

రక్త శిఖరం నిలువునా కదిలిపోతుంది

ఊపిరి లాగిన రబ్బరులా సాగి
ప్రాణక్షేత్రమంతా పగుళ్ళూ నెరదల్తో
విచ్చుకుంటుంది

అప్పుడు నువ్వే
నిజంగా నువ్వే
సుతారమైన సజీవ సితారు తీగల్ని తడిమి
వాకిలల తలుపుల్ని తట్టినట్లు
మళ్ళీమళ్ళీ తట్టినట్లు --

# పుంస్త్రీలింగం

నీరు న్యూట్రల్ కాదు
అది ఎల్లన్నవ్
లంకల్లోంచి తొంగిచూస్తే
నది (యిదొక పేరైనా అది నీరే)
తొడల్ని ఎడం చేసుకుని
నగ్నంగా పడుకున్న
ఆడదిలా వుంటుంది.
తెల్ల చేతులూపుకుంటూ
ఒడ్డు వక్షం వేపుకి పాకుతుంది
పాపాయిలాంటి పడవ
గాలి చేతుల్తో వీపున్నిమురుతూ
ఒడిలోకే లాక్కుంటుంది యేరు
కృష్ణవక్షంలో ఎండిపోయే
ఆకాశప్పాడి గేదె

చివరిగా యిచ్చిన కాపివిపాలూ
ఒళ్ళంతా ఒలికిపోయి
పీటమీదా, పింగిమీదా
ముక్కలు ముక్కలుగా ఎండిపోతాయి
పిన్నమొన్నటిదాకా యేరు
ఒదిగివొదిగి వెళ్తుండేదా
యిపుడేమో గట్లెక్కుతుంది
మేడలూ మెట్లెక్కుతుంది
నేలవరాల్లోంచి పాకి
వీధిమొగల్లో
యిళ్ళ పంచల్లో
మేడల్లో మిద్దెల్లో
శివలింగాలై మొలిచి
వెల్లకిలా పడుకున్న బిందెల్ని
దోసిళ్ళ దోనెల్ని
అరచేతుల దొప్పల్ని
అభిముఖంగా వీక్షించుకుంటుంది
నిజంగా నీరు
రెండువైపులా పదునుగల కత్తి
అది
ఆడదీ
మగాడూనూ --

మే, 1978

# భావరశ్మి

వాడిపోయిన తొడిమెలు
నా కళ్ళు

నువ్వు నడిచిన దారుల్లోనే కదా
నా పూలన్నీ రాల్చేసుకున్నాను

కేవలం భావరశ్మి సోకినంతనే
మన శరీర శిఖరాగ్రాల్లోంచి
మంచు ఎలా కరిగి కరిగి
మనల్ని తడిపేస్తోందో చూడు!

సరాల్లో పెదాల్ని బిగదీసి



ఆ షెహనాయీ ఎందుకలా రోదించడం

నీళ్ళ నునుపు మీద నీటిచుక్క జారిపడినట్టు
ఒంట్లోని యింట్లో, ఇవ్వాల్వింగ్ ఛెయిర్లో
ఒంటరిగా తలొంచుకొని ఏడ్వటం!

ఏమిటీ యీ సెల్ఫ్ పిటీ?!?
అర్ధరాత్రి అద్దం ఏడుస్తున్నట్టు .....

సముద్రం పుస్తకాల పుటల్ని తిరగేస్తుంది
దాని ఏకాగ్రతకేమైనా అంతరాయమా మనం?

మన సమస్య లెల్లాగూ
యిప్పట్లో తెమిలేట్లు లేవు
ఆ నక్షత్రాల్నెందుకూ యిబ్బంది పెట్టడం
వాటినిక నిద్రపొమ్మంటే పోదూ!

# తప్పదిక

పాడు మనసు తాను పడుకోదూ
నన్ను పడుకోనీయదూ!
ఆలోచనల దారాలు పట్టుకుని
అటు ఆకాశానికీ
ఇటు అగాధానికీ మధ్య
తిరునాళ్ళ చిన్నప్పట్లో
కొనుక్కున్న కోతిబొమ్మలా
అధోముఖంగా పైకెగబాకటం
ఊర్ధ్వముఖమై కిందికి దిగటం
గుండె చప్పుడుకే జ్ఞాపకాలన్నీ నిద్రలేవటం
కళ్ళలోంచి గేలాలు వదిలి
కలలమీద కసితీర్చుకోవడం

పరిసరాల్ని పరికించి చూస్తాను

మున్నెం కుప్పలో పొర్లి
నల్లకుక్కలా నడిచివస్తుంది వెన్నెల

నరాల పూదల్ని దిగజార్చుకుని
ఏ వాంఛా వటవృక్షమో
మెదళ్లో పెరుగుతుంది
అది గుండెల్లోకి
వేళ్ళుకాళ్ళను దోపి
పిచ్చుక గూళ్ళను కదుతోంది

ఈ మనసు పాడుగానూ
నిద్రల్లోనైనా
ఆ బొటనవేలు చీకటం
మానదుగదా!

దూరాన, కొండల కవతలి తీరాన
కాలం తోలుకువస్తున్న
కారుబైల్ల కాంతిచ్ఛాయలు

ఇంక లాభం లేదు
నా సామానంతా సర్దుకొని
ఈ బస్సైనా అందుకుంటాను మరి!

మార్చి, 1980

# పెదాల చితి

పాములా పాక్కుంటూ వచ్చి
ప్రశ్నార్థకంలా పడగ విప్పింది ఏకాంతం
విప్పిన డేగ రెక్కలలోంచి
అంతర్థానమవుతూంది ఆకాశం
మేఘాల శవాల్ని
మౌనంగా మోసుకువెళుతూన్న గాలి
ఏ పండుటాకు కుత్తుకనో
మెత్తగా కత్తిరిస్తుంది
గోళ్ళు తెగిపోయిన వేళ్ళతో
పదునుని పీటుకుంటూన్న
ఒక బాధాపారవశ్యం
వలయాలు వలయాలై

రహస్యాలల్లోకి లాక్కెళ్ళి
సహస్రాక విశ్వత్వాన్ని చేస్తుంది
అది, అది నా పాట --
కాలం కళ్ళు తెరవక ముందు
లోకం కదలని ఒక ఘూహాలోకం తప్ప
గుప్పెడు గుండెకాయలాంటి
దిగులు నిండిన శూన్యం తప్ప
మరేమీ కాకముందు
ఎక్కడా ఏమీ లేకముందు
హృదయమై స్పందించిన నా పాట --
మనిషి అని మార్మోగి
దిక్కులలోంచి దద్దరిల్లి
పరితపించిన నా పాట -
కరిగి కరిగి పరమాణువై
పంచభూతాల గర్భపీఠం మీద పగిలి
ప్రళయమైరేగి,
అల్లకల్లోలమై
సుళ్ళు, సుడిగుండాలై
చెలగి
చెలరేగి
లోయల్లోయలుగా
శిఖరాలు శిఖరాలుగా
అడవులు బీళ్ళు మైదానాలుగా

నదులు సెలయేళ్ళు సముద్రాలుగా
తోటలు తూనీగలు వసంతాలుగా
బ్రహ్మాండ గోళాలుగా
సాగి
స్తంభించి
ఆగి
ప్రజల్తోపాటు పరవళ్ళు తొక్కుతూ
ప్రపంచమై పరవశించిన నా పాట –
మట్టితో పుట్టి, మట్టితో పెరిగి
మట్టే సర్వస్వమై, మనిషి మస్తిష్కంలో
స్వేచ్ఛాసౌందర్యమై శోభించిన నా పాట –
ఊపిరి వటవృక్షానికి కాసిన
వెచ్చటి గుండెకాయలాంటి నా పాట –
అన్యాయమై, ఆకలీ కన్నీళ్ళచివికి
పల్లవి పగుళ్ళవించి
నాదాల నెరదల్చించి
నెత్తుటి మెత్తదనంలా
ఆవేదనలా, ఆర్తనాదంలా
నలిగి నలుపెక్కిన ఆత్మారావంలా
వినిపిస్తున్న నా పాట
పేర్చిన నా పెదాల చితి పీంచి
పచ్చటి మంటలా వెలుగుతుంది.

నవంబర్, 1979



# సిగరెట్టు నీడ

కాగితంమీద

అక్షరాల విషాదం

కళ్ళతోపాటు నల్లగా అల్లుకుపోతుంది

రాత్రి చీకట్లో

బంధించిన దారుల్ని తాకి

స్పందిస్తూ నాకేసి నడిచివస్తుంది నిశ్శబ్దం

ఎక్కడ్నించో ఎవ్వరిదో

చచ్చిపోతూన్న చిరునవ్వు చప్పుడు

నిలబడి వున్నాను

మూసిన రెండు తలుపులు



ప్రపంచం బరువుతో
జీవన్ శిరస్సులా
వేలాడుతూన్న తాళం

పునాదుల్నించి పైకప్పువరకూ
పేరుకుపోయింది చూపు

తలుపుల్ని తడుతున్నాను

ఎవరో లోపల ఉన్నారని అనుమానం నాకు
లోపల ఎవరో ఉరితీయబడుతున్నారన్న ఉద్వేగం నాకు

నాకు తెలుసు
వధ్యశిలా వేదికపై హంతకుడు కనిపించడు
తెరావుండదు సూత్రధారుడూ కనిపించడు

ఇక్కడి వాతావరణం జిహ్వాగ్రానికి
నానెత్తుటి రుచియేదో తెలుసు
దీనికి నేనంటే భయం
చినిగిపోతూన్న కేలండర్
చివరిపేజీ వెనుక నా నీడంటే భయం

అందుకే
నామీద కాదు
నేను కాలుస్తున్న సిగరెట్టు మీద విషూ
నేను వదుల్తున్న పొగమీద పగ

నాకంటె ముందు
నా వాసనల్ని పసిగట్టే కుక్కల్ని కంటున్న నేల
యీ నేల నేలంతా నా నెత్తుటి రుచి మరిగి
చెట్ల కింద నాలికల్ప్రసరిస్తుంది

బుద్ధుడు నాకు మొదటి గురువు
అడవుల్లో యిక నా అడుగుజాడ కనిపించదు

ఆశిస్తున్నాను
ఎదిరిస్తున్నాను

వీస్తున్న వడగాలులు నా వడిశేలలు

మానవ మస్తిష్కాల కేసి శబ్దాల్ని సంధిస్తున్నాను

నా శరీరం పేరు మానవుడు
నేను చదువుతున్న కాగితం పేరు మానవుడు



ఈ రాత్రి, దట్టమైన యీ కుడ్యాల్లోంచి
ఒక కిటికీ తప్పక విప్పుకుంటుంది కన్ను

శ్వాసిస్తున్నాను
శాసించటానికే చూస్తున్నాను

సెప్టెంబర్, 1981

# ఒక నిర్లిప్తపాట

ఇది కేవలం
ఒక విస్మృయా పర్వత శిఖరారోహణం
చాపిన చూపుల చరిత్రలో
రెపరెపలాడుతూన్న పీలి చెరగుల శూన్య విన్యాసం
ఒక మౌనంలో వికసించిన ఉదయాస్తమయాలమధ్య
తటపటాయిస్తున్న తియతియ్యని సెగ
కార్యం లేక కారణం లేక తెగిపోయిన తోరణం
తిరిగి తిరిగి తిరిగి తిరిగి
కరిగి అరిగిన చీమల కాళ్ళు
పెనవేసుకున్న పద్మాసనం మీద
బౌద్ధభిక్షువి మహాయానం
తమసోమా జ్యోతిర్గమయా

రెప్పల కింది దీపాన్ని
చప్పున చంపేస్తుంది చీకటి పొగ
సంధ్యార్ణవ సవరణలోంచి
కొట్టొచ్చినట్టుగా వచ్చి
కిందికిందికి తగ్గిపోతుంది
నలుపెక్కిన ఎర్రత్రికోణం
పగటి పీడకల పీడల్ని తరుముకుంటూ
పరుగెత్తి పరుగెత్తి
కలగాపులగమైన
కల్లోకి మేల్కొంటే
వున్నట్టుండి మొరుగుతుంది
ఒంట్లోంచి వూరకుక్క
తీరా తలుపులు తెరచి చూస్తే
మనసుమీదా, ఆకాశంమీదా
మబ్బు కమ్ముకుంటుంది
తడితడిగా ఒక శబ్దమేదో వచ్చి
కర్ణపుటాల్ని తడుపుతుంది
ఒకే ఒక్క నిర్లిప్తపాటులో
దేహం వెళ్ళిపోయి, శరీరం మిగుల్తుంది.

—మే, 1983

# ఆత్మహత్యాగ్రహం

అయినవాడు గదాని
ఆత్మహత్యను సయితం
సమర్థించడం కాదు –

సగం నలిగి చిత్తైన గొంగళీపురుగు
గచ్చు నేలమీద పడి తడితడిగా
తన ఎలిజీ తనే రాసుకుపోతూన్నట్టు
బతుకును మరణశాసనంలా
మోసుకుతిరిగేవాళ్ళకిది అర్థం కాదు

మృత్యువును కాదు
ఎంత ఘోరంగా వున్నా
బతుకునే ప్రేమించిన మనిషి –
మనుషుల మధ్య

మనుష్యుల కోసం వెతుక్కున్న మనిషి –
మనిషి మీదా
మనిషి మంచితనం మీదా
మంచి భవిష్యత్తు మీదా
నమ్మకాన్ని నిర్మించుకున్న మనిషి –

ఉన్నట్టుండి,
ఊపిరి తీరాన్ని దాటి
అనంతవాయులీనంలో
గానంగా మారడమేమిటి?

ఎందుకిలా జరిగింది?

సంక్షుభిత శరీరాన్ని
శాంతపరిచి శుశ్రూష చేసిన
సెలైన్ నదీజలాలు
సమాధానం చెప్పలేవు
నవ్వుకుంటూ
నాలిక చప్పరించుకుంటూ

పిల్లలోంచి పెద్దల్లోకి వెళ్లిపోయిన
ఖడ్గమృగాన్ని అవి గుర్తుపట్టలేవు
పిందుమార్యుల్ణి అవసరం చేసి
కళేబరానికి కుంకుమ పూజ జరిపిన
ఆకాశానికి యిది అర్థం కాదు

పంచభూతాలకీ
పండంటి జీవితాలకీ మధ్య
మనిషికీ మస్తిష్కానికీ మధ్య
వ్యక్తికీ సమూహానికీ మధ్య
గోడల్ని నిలువునా కూల్చలేనే తప్పు
పీడలు నిజాల్ని విప్పవు

తనువును ధనువును చేసి
ప్రాణాన్ని బాణంలా సంధించడం
ఆత్మహత్య అవుతుందా?

అది ఆత్మహత్యకాదు – ఒక ఆగ్రహ ప్రకటన
అది ఆత్మహత్యకాదు – బాధాగ్ని కణాల సంఘటన
అది ఆత్మహత్యకాదు – అభివ్యక్తి అంతిమ రూపం
అది ఆత్మహత్యకాదు – ఒక అంతులేని ఆరాటం
అది ఆత్మహత్యకాదు – ఒక రాజీ లేని పోరాటం

పంచనా బీభత్స సర్వస్వంలో
మానవునికి తనకంటూ మిగిలిన
ఒకే ఒక్క ఆయుధం శరీరం
అయితే, అది
ఆయుధ నిమజ్జనం కాదు
ఆత్మ నిచ్ఛేదనం
ఆత్మ విస్ఫోటనం

(బంగోరె ఆత్మహత్యకు ప్రతిస్పందన)

# చెప్పుల్తొడుక్కున్న శవం

1.

ఏదో హాహాకారాల సంఘటనం
ఇపుడే పరిసమాప్తమైనట్లుగా వుంది
ఆర్తరావాలు, ఆర్తనాదాల ప్రభంజనం
ఇంతకు ముందే అణగారిపోయినట్లుగా వుంది
ఇక్కడి చెట్లనీ, అడవుల్నీ
ఇంతకు పూర్వమే ఎవరో
పూర్తిగా నరికేసినట్లుగా వుంది
ఇక్కడి నదుల్నీ, సెలయేళ్ళనీ, సముద్రాల్నీ
ఇంతక్రితమే ఎవరో పాతాళానికి పంపించేసినట్లుగావుంది

2.

ప్రశ్నల్లేవు

సమాధానాల్లేవు
కనీసం వాటి తాలూకు
సదవిహ్వాలన్నా లేవు

3.

శాంతి లేదు
యుద్ధం లేదు
పగలుకీ, రాత్రికీ మధ్య భేదం లేదు.

4.

మంచు పర్వతాల్నే
తలపాగాలా చుట్టుకు
పడుకుంది దేశం
అంగలార్చిన ఆక్టోపస్‌లా
ఆగివుంది ఆకాశం
చిరనజీవ కళేబరంలా
పడివున్నది నేల

5.

కళ్ళల్లో కుక్కగొడుగులు
మెదళ్ళో మొండిచెయ్యి
పాకుడు పట్టిన పొట్టలో
పాలిపోయిన చిట్టెలుకలు
మనసు ముంగిట్లో చచ్చిన చింతచెట్టు

6.

పాదాలు ముందుకే ఉన్నాయి
స్వంత పీడకు కొనసాగింపై
సాగిపోతోంది శవం
చెప్పులొదుక్కున్న శవం

7.

తరతరాల పరాజయ పరంపరల
పతాక సన్నివేశంలో శవం
చెప్పులొదుక్కున్న శవం

బతికేవున్నానన్న భ్రమకీ
అందమైన అనుమానంలాంటి
అంధకారంలో శవం
చెప్పులొదుక్కున్న శవం

తెల్లవారటంతోనే లేచి
తన సమాధినీ, శ్మశానాన్నీ తడుముకుని
చల్లటి నిట్టూర్పు విడిచి
దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్న శవం
చెప్పులొదుక్కున్న శవం

పెళ్ళాం శవం పక్కన పడుకుని

శవాలను కలగంటున్న శవం
శవాలను కంటున్న శవం
తను కన్న శవాలు కనిపించకపోతే
తనే తిరిగివుంటానని అనుకుంటున్న శవం
చెప్పుల్తొడుక్కున్న శవం

మోకాళ్ళమధ్య తలదాచుకుంటున్న శవం
పరస్పరాంధకారంలో పరిస్పర్శించుకుంటున్న శవం

చెప్పుల్తొడుక్కున్న శవం

అజ్ఞానం, దారిద్ర్యం
కడలి లోతుల్ని కొలుస్తున్న
గడక్కర్ర లాంటి శవం
పట్టెడు మెతుకుల కోసం
పక్కలో పడుకుంటున్న శవం

గర్భం ధరిస్తున్న శవం
గర్భం స్రవిస్తున్న శవం

తల్లి శవం
తల్లి శవం మీదకి

ఏటుల్ని పిలుస్తూన్న పిల్ల శవం

రాళ్ళు మోస్తున్న శవం
రిక్షాల్తొక్కుతూన్న శవం

రాళ్ళ కింద శవం
అధికారం కాళ్ళకింద శవం

డిగ్రీలు ధరిస్తూన్న శవం
దిసమొలతో తిరుగుతూన్న శవం

తాత్వికుని శవం
అధివాస్తవికుని శవం
అమాయకుని శవం

చెప్పుల్తొడుక్కున్న శవం

మధ్యతరగతి శవం
మిధ్య తరగతి శవం

చెప్పుల్తొడుక్కున్న శవం

ఏంగికి చూపును చాపలేని శవం

నిర్భయంగా నేలను తాకలేని శవం

చెప్పుల్తొడుక్కున్న శవం

8.

శవాలు, రాబందులు వినా

చరిత్రలో ఏది లేదు

9.

బహుశా దిక్కులు లేవనెత్తితే

ఉషస్సు శవ పేటికలా పైకి లేస్తుంది

10.

శవం చావదు

కేవలం

నిద్ర లేవటం మానేస్తుంది

అంతే!

11.

సత్యం – శవం – సుందరం

సత్యం – శవం – సుందరం

సత్యం – శవం – సుందరం

12.

శతాబ్దాలుగా ఒకకన్ను

శవజాగరణ చేస్తోంది

శతాబ్దాలుగా ఒకకన్ను
కన్నీరు మున్నీరై పారుతోంది

శతాబ్దాలుగా ఒక కంఠం
ఎలుగెత్తి అరుస్తోంది

శతాబ్దాలుగా ఒక మనసు
మానవుడా మేలుకో అని పిలుస్తోంది

ప్రకృతి పరితపిస్తోంది
దిక్కులు తిరగబడుతున్నాయి.

13.

ఎప్పటికైనా ఒకకన్ను
కిరణఖడ్గమై కాంతివేగంతో
శవమెత్తిన జాతి గరిమనాభిని
తుత్తునియలు చేస్తుంది
శవధనుర్భంగం లోంచి
పిడికిలి బిగబట్టిన ఒక
శైశవం తప్పక ఉదయిస్తుంది
జంట పిడికిళ్ళతో అది
జయధ్వానం చేస్తుంది.

(పదేళ్ళ క్రితం రాసిపారేసుకున్న కావ్యాన్ని ఖండ ఖండాలుగా నెమరేసుకుని)

# ప్రశ్నావశేషం

ఏ శూన్య శిఖరాగ్ర
సమావేశానికీ
శవసత మౌన ప్రయాణం?

ఏ సుప్తసాగర
సంగమానికీ
స్తబ్ధ జలాశయ ప్రశాంత ప్రవాహం?

ఎవరిదీ నిమజ్జనం?
ఎవ్వరికీ సంతాపం?
పునరపి ఖననం
పునరపి మరణం

ఈ మిథ్యా సౌందర్య

సరస్తీర జలాల్నించి
నిమజ్జనోత్సవాన్ని
ఎలా ఆవిష్కరించడం?

ఈ ఆలోచనా
దారిద్ర్య దిగంత రేఖ మీంచి
దిగబడిపోతున్న
సూర్యుణ్ణి
ఎలా వెలికితీయడం?

సృష్టి వాకిట్లో
దైన్యంగా పడిగాపులు గాస్తున్న
ఈ సామూహిక శ్రద్ధాసక్తిని
ఎలా భగ్నం చేయడం?

ఎవరిపై ఈ నేరాన్ని మోపడం?
ఎవరెవరినీ, వేటినీ, ఎందుకూ
దోషులుగా నిలబెట్టడం?

ఈ ఇంద్రియ పతనాన్నీ
ధ్యాన దౌర్బల్యాన్నీ
శబ్ద నైరాశ్యాన్నీ



ఏ విధంగా అంచనా గట్టటం?

సాధించిన దేముందని యీ సుషుప్తి ?
శ్రమియించిన దేముందని యీ విరామం??
పోయేదేముందని యీ భయం, భ్రాంతి, విభ్రమం???

— జనవరి, 1980

# కిటికీలోంచి

మాటిమాటికీ మెట్లు ఎక్కిదిగుతూ
ముచ్చటగొలిపే పిల్లాడిలా ఎండ
ఎంత తప్పించుకు తిరుగుదామన్నా
కాళ్ళను చుట్టేసుకుంటుంది నీడ
ఎండ తుట్టెలోంచి తేమను పిండుకుందామని
ఎన్నాళ్ళనించో నా ప్రయత్నం
వెదురు విచ్ఛిన్నమైంది
మేఘాల చెట్లెక్కి
చినుకుల్ని కోసుకురావాలని
చిన్నప్పట్నించీ నా తాపత్రయం
తీరా వెళ్ళి ఎలాగోలా
మబ్బుల మూతల్ని తప్పించిచూస్తే

బెకబెకబెకమంటూ
బెదిరించేస్తాయి కప్పలు
సంధిద్దామని
అందుకోబోయేంతలో
ఊసరవెల్లి అయిపోయి
ఆకాశం మీంచి అమాంతంగా
ఏ నవ్వని చెట్టుమీదికో దూకేస్తుంది
ఏడురంగుల ఇంద్రధనుసు

పరిసరాల కతీతంగా నేత్రాల అద్వైత స్థితిలో
తాడిచెట్టు కిటికీ చువ్వలు --

భూమ్యాకాశాల మధ్య
గుడిబండలా వేలాడుతూ
ఎప్పట్లాగే ఎండ

జూన్, 1979

# రాత్రికీ రాత్రికీ మధ్య

ఒక బలమైన కలని
బద్దలు గొట్టుకుని
హఠాత్తుగా మీదపడిపోతుంది
మెలకువ –

రేయింబవళ్ళ మధ్య
మసక మసగ్గా వెలుగుతుంది
అస్పష్టపు వేకువ –

నిండు జాగారం చేసి
బండలైపోయిన కళ్ళు
ఏక్షణాన్నయినా ముంచేస్తాయి



నిలువునా నిద్దట్లోకి --
అలసటని ఆసాంతం
వార్చేసుకున్న శరీరం
స్పృహలోకి తేల్తుంది
ప్రాణబింబంలా -

పక్షుల కలకలం వినిపిస్తుంది

ఇంతకీ అది
ఉదయోత్సవ సంరంభమో
సాయం సంతాపశోకమో
అంతుపట్టదు -

మనం మేల్కొన్న తెరకి
అటూ యిటూ ఏముందో
ఎంతకీ అర్థంకాదు -

పగటి తేటని చూసీచూడకుండానే రాత్రి నుంచి రాత్రిలోకి
బతుకు వేడిని తడిమీతడమకుండానే
జననాన్నుంచి మరణానికి -

ఒక ఎడతెగని నిస్పృహ -

ఒక సుదీర్ఘ సుషుప్తి -

ఒక అవ్యక్త మహాప్రస్థానం -

జనవరి, 1990

## పొగచెట్టు

నల్పబడుతూన్న కొనల్లో
నెత్తిమీద నల్లమబ్బు
నేలను చీల్చుకు ఎదిగిన
నల్లని పొగగొట్టంలా తాటిచెట్టు

పల్లెకీ, పట్నానికీ మధ్య
పొసగని దాంపత్యంలా
ఎనుగెత్తిన నేను --

పల్లె వదల్దు
పట్నం యింకదు

ఊర్లో మేతకెళ్ళి



వంటినిండా జలగల్తో
ఇంటికొచ్చిన మాగేదెకీ
బతుకు తెరువైతే
నగరం పాలైన నాకూ మధ్య
లీలగా ఏదో పోలిక

విద్యుత్తీగెల్తో పల్లెల్లోకి పాకి
నేలతల్లి నరాల్ని
మూగజనం మూలుగల్ని
నిర్దాక్షిణ్యంగా పీల్చేసే
కాంక్రీటు ఆక్టోపస్ నగరం

ఆకాశాన్నిదుకుంటూ
చిన్నప్పుడు మా వూళ్ళో
పిల్లంగోవిలా పరుగుల్తీస్తూ
పరవశింపజేసిన విమానం
నాతో పాటు పెరిగి పెద్దదై
నగరం చేరినట్టుంది
ఆకాశం గతుకుల కంకర్రోడ్డుమీంచి
ఖాళీ పీపాల్ని దొర్లించుకుపోతూన్నట్టు
బీభత్సం యిపుడు దాని శబ్దం

ఠః కర్ణకఠోర శబ్దాంచలాన్నందుకుని
స్వరమార్దవ సరిహద్దు మీంచి
మావూరెళ్ళిపోవచ్చేమోనని
చాలాసార్లు చిత్రంగా భ్రమించాను

ఠః నగరం నన్ను సేదదీర్చదు
ఠః విమానం నన్ను మావూరు చేర్చదు

సిమెంటూ, తార్రోడ్లూ లేని
సందులు గొందుల్లోంచిపడి
నాకోసం మావూరు నడిచి వచ్చిందేమోనని
నగరం పొలిమేరల్దాకా పరుగెత్తి
ఆశగా చూస్తే, దూరంగా మళ్ళీ అదే దృశ్యం --

పల్చబడుతూన్న కొసల్తో
నెత్తిమీద నల్లమబ్బు
నేలను చీల్చుకు ఎదిగిన
నల్లని పొగగొట్టంలా తాటిచెట్టు

# పుట్టుమచ్చ

ఒక కట్టుకథ నన్ను కాటేసింది
ఒక వక్రీకరణ నన్ను వంచించింది
ఒక అపనింద నన్ను అల్లరి పాల్జేసింది

1955 ఆగస్టు 10 నా పుట్టిన తేది
కృష్ణాజిల్లాలో ఒక మారుమూల కుగ్రామం మావూరు

నేను పుట్టకముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదైవుంది నా పేరు

కన్నబిడ్డని సవతి కొడుకుగా

చిత్రించింది చరిత్ర
అస్పృదమ్ముల్నించి చీల్చి
నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర

పసితనంలోనే
నన్ను పరిహసించాయి
పాఠ్యపుస్తకాలు

పాత పోసుకుంటున్న
నా వ్యక్తిత్వం మీదికి
వింతవింత భయాల్ని ఉసిగొలిపి
నిర్దాక్షిణ్యంగా నన్ను చిత్రవధ చేసి
సుడిగాలుల పాల్జేసింది చరిత్ర

నా ప్రమేయం లేని పరిణామాలకు
నన్ను కర్తను చేస్తోంది వర్తమానం

నా అస్తిత్వం చుట్టూ
అనుమానాల వలయాల్ని విస్తరిస్తుంది వర్తమానం

నా నెత్తిమీద సదా
నిఘా నీడల్ని విసిరేస్తుంది వర్తమానం

ఆడపిల్ల అందాల్ని బంధించినట్టు
నా ఆకారాన్ని అంకెల్లోకి దట్టించి
నాయింట కన్ను తెరచిన
నవజాత శిశువు తెగ్గోసుకున్న
తల్లి పేగు చివర తడియారని నెత్తుటి బొట్టులో
1947 ని దర్శిస్తుంది వర్తమానం

'హిందీ–హిందూ–హిందూస్థాన్
ముస్లీం జావో పాకిస్తాన్

'ముసల్మాన్ కే దోహిస్థాన్
పాకిస్తాన్ యా ఖబరస్తాన్

నినాదాల వర్తనశాలలో
నన్ను నివ్వపోయుణ్ణి చేస్తుంది వర్తమానం

రాజ్యాంగం నా భుజం తట్టదు
మీసాల గుబురుల్లోంచి
ముసిముసిగా నవ్వుకుంటూన్న
మూడు సింహాల సింహాసనం
నాకేసి ముఖం తిప్పదు
ప్రథమ శ్రేణి పౌరుని మస్తిష్కంలో

పరదేశిగా తప్ప, 1947కి స్మారక స్థూపంలా తప్ప
మనిషిగా నా బొమ్మ రూపు గట్టదు

అవును, నేను కుట్రదారుణ్ణి కదూ!

అవును, ఇస్లాంకీ–ఇస్లామాబాద్‌కీ మధ్య
అభేదాన్ని పాటించడం కుట్రకాదు
నా కాళ్ల కింది నేలని
తొలిచేయాలనుకోవడం కుట్ర కాదు
పుట్టి పెరిగిన దేశంలోనే
సన్నాయిక కాందిశీకుణ్ణి చేయడం కుట్రకాదు
పరిసరాల్నీ, వాతావరణాన్నీ
నామట్టా విషపూరితం చేయడం కుట్రకాదు
ఖండఖండాలుగా నరికి
నిలువునా నన్ను నిర్మూలించి
'అఖండ భారతం' నిర్మించాలని
కలలు గనడం కుట్రకాదు

కేవలం నా మత విశ్వాసాలు కుట్ర
నా సామూహిక ప్రార్థనా సమావేశాలు కుట్ర
నేను మత్తుగా పడివుండటం కుట్ర

నేను మేల్కొనేందుకు ప్రయత్నించడం కుట్ర
నేను నలుగురితో కలిసి వుండాలనుకోవటం కుట్ర
నేను బతికి బట్టకట్టాలనుకోవడం కుట్ర
నా అజ్ఞానం కుట్ర, నా వెనుకబాటుతనం కుట్ర
నేను పెళ్ళాడటం కుట్ర, నేను పిల్లల్ని కనడం కుట్ర

స్థాయీభేదాల సారాంశంలో
రాజ్యాంగం నాతో ఆడిన
'పవిత్రమైన' పరాచికం నా పౌరసత్వం

పట్టెడన్నం కోసం
పేవ్‌మెంట్ల మీద పూలమ్ముకుంటాను
పళ్ళమ్ముకుంటాను, పల్లీలమ్ముకుంటాను
గొడుగులు బాగు చేస్తుంటాను
గడియారాలు బాగు చేస్తుంటాను
వీధరుగుల మీద దర్జీ పని చేస్తుంటాను
దూదేకుతుంటాను దినంగడుపుకుంటాను
ఏ గొడవల్లేకుండా
బతుకును వెళ్ళమార్చాలనుకుంటాను

ఉన్నట్టుండి ఎందుకోమరి
నగరాల నడివీధుల్లో నా నెత్తురు

తీర్థస్నానఘట్టమవుతుంది

ఎన్నికలకు ముందు
ఎన్నెన్నో సంఘటనలకు ముందు
దేశ చరిత్ర దిశానిర్దేశానికి
నా నెత్తురు గూడుపట్టవుతుంది

పార్లమెంటు భవనంలో వాలేందుకు
నా నెత్తురు పాదలేపనమవుతుంది

నా రక్తం రియల్ ఎస్టేట్
వ్యాపారమవుతుంది

నా రక్తం రాజ్యాధికారానికి
రక్షణ కవచమవుతుంది

నా రక్తం పదవీసోపానానికి
అభయ 'హస్త' మవుతుంది

నారక్తం 'భరతమాత' నుదుటి
తిలకమవుతుంది, పూజా 'కమల' మవుతుంది

నేను వేసిన ప్రతి ముందడుగూ

ఒక నెత్తుటి మడుగవుతుంది

నా గూడు బాణసంచా అవుతుంది
నా గూడు భోగిమంటవుతుంది
నా గూడు నరకాసురుని చితాభస్మమవుతుంది

భవిష్యత్ తరాల కోసం
ఆదిమానవుడు చరిత్ర గూట్లో భద్రపరిచిన
పావురాల గుడ్లు చితికిపోతాయి

పటపటమని విరిగిపోతూన్న
నేలతల్లి పక్కటెముకల శబ్దం
నా చెవుల్లో చివరిసారిగా ప్రతిధ్వనిస్తుంది

కలలు నా మాతృభాషలో రావటం మానుకుంటాయి
నా ఆలోచనలు సయితం అధికుల భాషనే ఆశ్రయిస్తాయి

క్రికెట్‌మేచ్ నా దేశభక్తికి
తూనికా, కొలమానమవుతుంది
నేను నా మాతృదేశాన్ని
ఎంతగా ప్రేమిస్తున్నానన్నది కాదు
ఏయే పరాయి దేశాల్ని

ఎంతెంతంగా ద్వేషిస్తున్నానన్నదే
నా దేశభక్తికి ఎంతోకొంత ఆధారమవుతుంది

వెండి తెరల మీంచీ
రంగ స్థలాల మీంచీ
కళామర్మజ్ఞుల విచిత్ర విన్యాసాల మీంచీ
నా విదూషక ఖలనాయకుని వేషం
అందరికీ వినోదాన్ని అందిస్తుంది
సాంస్కృతికంగా నన్నొక వికలాంగుణ్ణి చేస్తుంది

క్షమించండి, నా స్నేహితుల్లారా!
వక్రీకరణకి వత్తాసుగా
పదబంధాన్ని సృష్టించి
నన్ను వెక్కిరించడానికి వెనుదీయని
మహాకవిని నేను మన్నించలేను!

మన్నించండి, నా మిత్రుల్లారా!
రాజుకీ, పేదకీ మధ్య
భేదాన్నే చూడలేని
ప్రజాకవి ఉద్రేకానికి
నేను ఉర్రూత లూగలేను

హింసకి ప్రతిరూపంగా

అసహనానికి ప్రతీకగా
నా గురించి జరిగే ప్రచారాల్ని విని
నేను నవ్వుకుంటాను

నా పరిణామాల భవిష్యత్ ప్రమాదాల
భేతాళ కథల్ని విని
నేను నవ్వుకుంటాను
చరిత్రను మతంగా
మతాన్ని చరిత్రగా
చిత్రిస్తున్న పాలకుల ముంగిటి
కాపలి కుక్కల మొరుగుల్ని విని
నేను నవ్వుకుంటాను

నా నవ్వులకు సమాధానంగా
నిందలు ప్రతిధ్వనిస్తుంటాయి

నిజానికి నాది నవ్వుకాదు
నేను అనునిత్యం
అతిసునాయాసంగా
దిగమింగే నా ఆర్తనాదం

అగ్రవర్గం అన్యాయంగా

నా మెడ చుట్టూ బిగించి వెళ్లిన
పర్సనల్‌లా ముళ్లకంచె గురించి
బాధపడాల్సింది మరెవరో కాదు నేనే

ఆర్టికల్ 370 గురించి
అణగారిపోవాల్సింది ఎవరో కాదు నేనే

ఆచరణతో ప్రమేయం లేని
అక్షరాల లౌకిక భావనకి
అన్యాయమైపోయింది ఎవరోకాదు నేనే

అవును, నాది మచ్చపుటక అన్నారు కదూ!
నన్ను ఏకంగా పుట్టుమచ్చగా పునీతం చేశారు కదూ!

పెత్తందార్ల ఎత్తుగడలు, వ్యూహాలకీ
నా చుట్టూ అల్లుకుంటూన్న ఉరితాళ్ళకీ మధ్య
ఏమిటీ అనుబంధం అని అడగలేను
వాళ్ళూ వాళ్ళూ కలిసి పంచుకున్న వూళ్ళ మధ్య
అర్ధరాత్రి సరిహద్దు రేఖలా పారిన నెత్తుటి యేరుతో
ఏమిటీ నాకున్న సంబంధం అని నిలదీయలేను
త్రిశూలాల మొనల మీదా
పి.ఏ.సి. తుపాకుల కొనల మీదా
తాలెబ్ బాకుల కొనల మీదా

నెత్తురోడుతున్న నా పుట్టుమచ్చను గురించి
ప్రశ్నించలేను

అవును, పుట్టుమచ్చ నా ఉనికి
పుట్టుమచ్చ నా అస్తిత్వం
పుట్టుమచ్చ నా పౌరసత్వం
నేను ఊపిరి పీలుస్తూ మసలుతున్న
నేలా గాలీ పరిసరాలూ
నాకు దఖలు పరిచిన పౌరసత్వం పుట్టుమచ్చ
ఎప్పటికీ మానని గాయం యీ పుట్టుమచ్చ

— ఫిబ్రవరి 1991

1. మహాకవి శ్రీ శ్రీ 'కసాయి', 'సాయిబు' అనే పదాల్ని కలిపి 'కసాయిబు' అనే పదబంధాన్ని తాను సృష్టించినట్టు వ్యాసక్రీడల్లో చెప్పుకున్నాడు.

2. ప్రజాకవి సుద్దాల హనుమంతు 'వెయ్, వెయ్‌రవెల్ల వెయ్ / తరగర, పరకర / తురకలు గుండా గొయ్యిలు' అంటూ ఒక పాట రాశాడు. నిజామ్ నవాబు ముస్లిం కాబట్టి ఏకంగా తురకల్ని తరిమేయమని పిలుపు ఇచ్చాడు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో 'బందగీ' వంటి 'తురకోల పాత్రను విచిత్రంగా విస్మరించాడు.

"నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై వుంది నా పేరు

కన్నబిడ్డని సవతి కొడుకుగా
చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్నించి చీల్చి
నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర"

కవిత్వం ప్రచురణలు